కూర్చుని ముచ్చట లాడుకుంటూవున్న బండక్రింద కంటా చౌఅబారి తరతరాలనుంచి నాటుకు పోయివుంది. ఆకలిచిచ్చు కొద్దీ కొట్టిన కోయవాని నరుకుడు దెబ్బకు వేరుతెగడమేకాకుండా తెగినవేరు రాతిబండను లేవనెత్తి బండసమేతంగా ఆ కాముకుల నిద్దర్నీ కిందకు పడద్రోసింది. ఇద్దరూ వేరువేరు శరీరాలుగా దిగులోయలోకిపడి నశించిపోయినారు.

కోయవాడొక్క కన్నీటి చుక్కైనా వారికోసం కార్చ లేదు.

"నరకవయ్యా! నరకవయ్యా! నరకవయ్యా!" అని ఇంకా తుండ్లు తుండ్లుగా అమ్మహావృక్షాన్ని నరుకుతూనే వున్నాడు. ఎంత అంతులేని ఆకలోవానిది?

.... .... .... .... ....

## దారిలో వాన

బజారుచేసికుని ఇంటికివచ్చే దారిలో పెద్ద వాన పట్టుకుంది. ఇంతలోకే వానకురుస్తుందా అని గొడుగుకూడా తీసికుని వెళ్ళ లేదు. కట్టుకొన్న, తొడుగుకొన్న బట్టలు తడిసిపోకుండా ఇంటికి జేరుకోవడం అనేదే గొప్పసమస్య అయిపోయింది ఆప్రొద్దు—నాలాగే బజారుకి నడిచే చాలామంది జనమూను. వాళ్ళసమస్య నా సమస్య ఆ నిమిషం ఏకాంగీకారాన్ని వున్నట్టు కొందరు, కొందరు ఒక్కొక్క అరుగుమీదకో, ఒక్కొక్క పంచకో, ఆఖరుకు కనపడ్డ చాడీమీదకో చేరుకోగలిగాం. చెట్లక్రింద పళ్లు అమ్ముకునేవాళ్లు, మంగలిపని చేసేవాళ్లు, పనిచేయించుకునేవాళ్లు

అందరూ ఎక్కడో ఒకచోట తలదాచుకునే నిమిత్తం దాక్కున్నట్టు ఒదిగివున్నారు. రోడ్డుఅంతా వానతప్ప మరేమీ కనిపించలేదు. పశువైనా కసవైనా ఆ వానకు తడియడం లేదు. పైనుండి వాన, క్రిందనుండి దొడదొడా నీరు, ఈ రెండు తప్పిస్తే, గాలి, నల్లటిమబ్బూ! ఇదీ ఆనాటి లోకం!

అయితే ఒక ఎండుచెట్టు మాత్రం కేవలం తన ఆకారాన్ని చూపిస్తూ, మళ్ళీ చిగురించలేని కొమ్మలరెమ్మలతో ఇక ఏమాత్రం గాలివేసినా, చినుకుపడ్డా పడిపోయేటంత బలహీనంగా అక్కడగపించింది. ఆ చెంతనే ఒక యింటి అరుగువుంది. ఆ అరుగుమీదకు కొందరు చేరుకున్నాము. ఆ ఎండుచెట్టుయొక్క ఊగిసలాటను నేను చూస్తూవున్నాను. వాళ్లువాళ్లు వానకాళ్ళకు విస్తుపోతూ వున్నారు. చెట్టువూసేలేదు వాళ్ళబాసలో. ఎంచేతా అంటే, ఆ చెట్టు ఆకు అలముతోకూడి నీడిచ్చేదికాదింక, పండు ఫలము కాసేదికాదు. పురపాలక సంఘంవారు దానిని ఏలంవేయక పోవడంచేత అలా నిలిచివుందోఅది, ఒకమాటు పడిపోతే ఎవ్వడైనా నిలబెట్టేడోకూడాను! ఒకడు నిలబెట్టడానికి అదేం చిన్న మొక్క, చేవగల చితుకుగాదు. ఆలాదేవుడే "ఎన్నాళ్ళుంటావో అన్నాళ్ళూ ఉండు!" అన్నట్టుంది. పొయ్యిలోకి కట్టెపుల్లలుగా కాకుంటే, మరి దాని ఉపయోగంగాని ఉపకారంగాని లేనట్టుంది ఆ చెట్టు!

"ఆఖరుకు ఆ చెట్టులాంటి బతుకు అయిపోయింది మనది!" అన్నట్టు వినవచ్చింది అరుగుమీద నుంచున్న వాళ్ళనుండి. నా చెవిలో ఎప్పుడైతే ఆ మాట పడిందో, నేను వెనక్కు తిరిగిచూచాను. వాళ్ళు ఇద్దరు ముసలివృద్ధులు! ఒకమనిషి

ఆడమనిషి, ఒకమనిషి మగమనిషి! క్రిందశ్రేణికి చెందిన వాళ్లై యుంటారు. ఏవో మామిడిపళ్ళు అమ్ముకుంటూ అవి అక్కడేవదలి తాము వానకుజడిసి అరుగెక్కిన వృద్ధదంపతుల్లా తోచారు నామనానికి. "ఏం మీకేమర్రా? మీరు మాట్లాడు కొంటూ వున్నారు! ఆ చెట్టు మాట్టాడనేరదు! దాన్ని ఉప మానంగా చెప్పుకుంటారేం మీరు?" అని అడిగాను యాదా లాపంగా.

మూడోవాడెవడో వాళ్ళనుకొన్నబాస అర్థంచేసికొన్నా డని, ఒకింత మూకీభావం వహించినారు నేనడిగినదానికి సమా ధానం ఇవ్వకుండా! కాని వాళ్ళకి మనుమరాలు ఓ చిన్నపిల్ల, అదీ వానకుజడిసి అరుగెక్కిందే, పదిపదహారేళ్ళది, పంవిట సర్దుకుంటూ అంది. "వాళ్ళిద్దఱకూ అన్యోన్యం అస్తమానం ఆలోచనేలేంది! ఒక ఎండలేదు, కొండలేదు, వానలేదు, వనం లేదు! అన్యోన్యం అస్తమానం ఏదో ఊగులాటే!" అంది. ముసిలివాళ్ళిద్దరూ నవ్వారు!

నేనున్నూ ఆ పంవిట సర్దుకునే పిల్లకేసి చూశాను. అది దీర్ఘంగా జడవేసికొన్నది. తీరుగా బొట్టెట్టుకుంది. తిన్నగా నడువగలదు అనునట్టి పాదాలు అమరివుంది. ఎంతఎత్తు, ఎంత లావు వుండాలో అంతే వుండడమే కాకుండా మంచి, సత్తువ సత్యంగల యువతిలా గగపించింది. సరిగ్గా కళ్ళల్లోకి చూస్తే ఏళ్లు దానివి ఓ పద్దెనిమిది ఉండవచ్చును. పలాచటి చీరకట్టింది. పంవిటంచే రయికక్కా, కప్పుకాబోలు చలికి వానకు; ఆమెయొక్క స్వరూపం తుదిమట్టంగా వుండిపోయింది ఆ కుసింతవేపు. అదంటుంది "వీళ్ళకో సినీమా అక్కఱలేదు. చిరుతిండి

అక్కఱలేదు. సీసాపెంకులా ఎదరవాళ్ళని సలుపుకుతినడమే వాళ్ళకలవాటు. ఇప్పుడా చెట్టును పడగొట్టమంటే దెబ్బకు వాడు పడగొట్టగలడు. అది పేళ్ళన్నీ తనయింటికి జేరమొయ్యగలదు. ఆ ఎండు చెట్టులాగున్న దాన్నల్లా నేనే! నేనొకర్తెనే!" అంది ఆ పిల్ల. నేనున్ను "ఏదో తగువుపడుతున్నారు వీళ్లు ముగ్గురున్నూ" అని అనుకొన్నాను.

అంతలోకే వాన వెలిసింది. రోడ్డు సిమెంటుదేమో కడిగినట్టయింది. ఆ కడిగినట్లున్న దానిమీద ఎండ రంయిని కాయజొచ్చింది. మళ్ళీ ఎప్పట్లాగ సంచారం! సందడి!

జనంమొత్తం ఆలా నడుస్తూనే వున్నారు. ఫెళఫెళామంటూ పడింది ఎండుచెట్టు మొదటకంటా! తుండు ఇటు, మొండి అటు! పిల్ల "ఇకనేముంది?" అని ముసలివాళ్ళకేసి ముసలివాళ్ళు "ఇఖనేముంది?" అని పిల్లకేసి చూడసాగారు. నిజానికిరుపార్శ్వాలావారూకూడా క్షేమమే! వాళ్లు ముగ్గురే కాకుండా యావన్మందీ యావత్తులోకమూకూడా క్షేమమే! ఎవరికీ ఏమిఅపకారం చేయకుండా ఎండుచెట్టు తనంతటదే కూలిపోయింది. ఆ కూలిపోతూవున్న చెట్టువంక అందరూ ఊరికే చూడసాగారు.ఎవరికితోచిన వింతపలుకులు వారన్నారు.చెట్టునంటి ఒకపిట్టలేదు. ఒకగూడులేదు. సాలిగూడుకూడా లేదు. కాని పడ్డంలో దారికడ్డంగా పడిందేమో "ట్రాఫిక్‌బందీ!"

వెంటనే పడుచుపిల్ల పోలీసుతో "ఎందుకండీ! ఏలంపాట: ఆ చెట్టును కట్టెలుకట్టెలుగా విరిచి పట్టుకుపోండ్రా అంటే ఒక్క నిమిషములో ఆ ముసలివాళ్ళిద్దరూ పట్టుకు చక్కాపోగలరు" అని అంటూ అడ్డంగాపడ్డ చెట్టును రోడ్డుకోప్రక్కకు త్రిప్పి ఆ పడుచుపిల్ల "ఓసి ఉత్తిబెండు. అంతా తేలికే!"

అంది. అంతా ఆశ్చర్యపోయారు ఆ పడుచుపిల్లకేసి ఆ ఎండు చెట్టుకేసి చూస్తూ:

ముసిలివాళ్ళిద్దరూ విరువజొచ్చారు బెరడుసమేతంగా ఎండుకొమ్మల్ని, ఎండురెమ్మల్ని. మరీ పేదవాళ్ళింకా చెట్టును చుట్టుముట్టి, ఒక్కొక్కళ్ళు వాళ్ళవాళ్ళకు సరిపడ్డ మోపులు కట్టుకున్నారు. ఒక్క నిమిషములో చెట్టు చెట్టు మాయమైపోయింది. పైని మబ్బు మాయమైంది. వానా పోయింది. ఎటుచూచినా వెలుగే ఎటుచూచినా వెలుతురే! అందులోనూ ఆ చెట్టుపడ్డ స్థలంమీద ఒకటే కొత్తకాంతి!

పురపాలక సంఘపుటధికారి కొంతసేపటికివచ్చి, "ఇక్కడుండే చెట్టుఏది?" అని అడిగేలో పిల్ల కొత్తకాంతికేసి చూస్తూ పకాల్ను నవ్వింది "ఇంకా చెట్టేంటి? దాన్ని విఱిచి ఈపాటికి ముసిలివాళ్ళు పొయిలో పెట్టివుంటారు" అని అంది. అధికారి "ఇంకా చిగురుపడుతుంది ఆ చెట్టు అని అనుకొన్నాను. ఇంతలోకే అంతపని జరిగిందా?" అని ఉత్త ఆకాశంకేసి ఓమాటు అమ్మ త్తకాసినికేసి ఓమాటు చూచాడు. పిల్ల "నన్ను పాతివేస్తే చిగురుపడుతుందేమో!" అని అంది. "అంత అక్కసు ఎవళ్ళమీదనేమిటి?" అని అడిగాడు అధికారి. పిల్ల "ఒకళ్ళమీదనేమిటి? ప్రపంచం మీద, సంఘంమీద!" అని అంటూ తానో లేడి పరుగెత్తినట్టు పరుగెత్తుకు పోయింది అమ్మకునే పళ్ళతట్ట పుచ్చుకుని. అధికారి "సౌందర్యం! సౌందర్యం!" అంటూ ఆశ్చర్యపడసాగాడు.

నేనున్ను "ఎండుచెట్టు సౌందర్యమా?" అని అడిగాను. అధికారి "కాదండీ! ఆ పిల్లకూడా వెళ్ళిపోయిన ఈ వెనుక ప్రసరించిన పూరా వెలుగుసౌందర్యమును చూచి ఆశ్చర్యపోతున్నాను" అన్నాడు. పైకిచూచాను నేను. ఊరికే ఆకాశం

మీద మళ్ళీ మబ్బు కమ్మేస్తూవుంది. తిరిగి వాన కురిసేటట్టుగా వుంది. అంతా గోదావరి జల్లువాలకంగా వుంది. ఇక తడవడానికిష్టంలేక నేను నాయింటికి చక్కాపోయాను.

మర్నాడు "వనమహోత్సవం" "వనమహోత్సవం"తో పాటు "వన్యమృగాల మహోత్సవం" కూడా ప్రభుత్వము వారు జరుపుతూవున్నారు. "సహజీవనం" లోనే సమధిక గౌరవం కద్దని ప్రతిపాదిస్తున్నారు ఉపన్యాసకులందరూ. క్రితం రోజున ఎండుచెట్టు పడిపోయిన తావున మఱొక పచ్చని మొలక నాటుదాం అనే తలంపుతో అధికారి గొయ్యి తవ్విస్తూవున్నాడు. "ఏమొక్క పాతేద్దామా?" అని పైయధికారి యోజిస్తూ వున్నాడు. కాలం వర్షాకాలం. సూర్యుడు మబ్బూ రెండూకూడా పందెంవేసి పరుగెడుతున్నాయి. ఉపన్యాసకుడొకడు "లేడిని మరి సింహం చంపబోదు. సింహాన్ని మరి శరభం చంపబోదు. మనం ఈ పైనుంచి శాంతియుగంలో స్వర్ణయుగంలో వాసం చేయగలము" అని ఉచ్చైస్స్వరాన్ని పలుకుతున్నాడు. ఖణేల్‌మనే గునపానికి ఒక మాంసాస్థుల బుంగతాకింది. "ఏమా? అని అందరూ పరిశీలించారు. ఆ శరీరము ఆ పిల్లది! అంధకార బంధురమైన గతరాత్రి ఆ గోతిలోపడి చనిపోయింది. పైన మట్టిపడివుంది.

పేళ్ళు ఇంటికి మోసుకువెళ్ళిన ముసిలివాళ్ళిద్దరు తిరుగ వచ్చి తమ పిల్లనుగురించి అడిగేలో ఈ వైపరీత్యము నడిచింది. కారణం వాళ్ళకూ తెలియదు ఎవళ్ళకూ తెలియదు. అధికారి మాత్రం అన్నాడు "ఈ తావున పాతే పచ్చటి కొత్త మొలకకు ఆమెపేరు పెట్టండి!" అని. ఆ పేరు పదిమంధి ఉచ్చరించేలో పెద్దవాన! దారిలోవాన!

.... .... .... .... ....